# ప్రజాశక్తి

ఆదివారం 14 డిసెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోసం..

## ఉత్సాహంగా బీచ్ వాక్

బీచ్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న అజశర్మ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలంటూ శనివారం ఉదయం 6.30 గంటలకు విశాఖ తీరంలోని కాళీమాతా టెంపుల్ నుంచి వైఎంసిఎ వరకూ బీచ్ వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా పూర్వ కార్యదర్శి ఎ.అజశర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఎర్ర షర్టులు, చీరలు ధరించి సంఘం నాయకులు, కార్మికులు బీచ్ వాక్‌లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారినుద్దేశించి అజశర్మ మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో ఏర్పడిన సిఐటియు దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులను, కార్మిక సంఘాలను ఐక్యం చేసి మహత్తర పోరాటాలు చేపట్టిందన్నారు. కార్మికవర్గ సమస్యలపై నిఖరంగా పోరాడి అనేక విజయాలు సాధించి, దేశంలోనే అతిపెద్ద సంఘంగా ఏర్పడిందన్నారు. సిఐటియు ఏర్పడిన 55 ఏళ్ల తరువాత ఆంధ్ర రాష్ట్రంలో అఖిల భారత మహాసభలు జరుగుతున్నాయన్నారు. విశాఖలో, ఆంధ్ర రాష్ట్రంలో కార్మికుల సమస్యలపై సిఐటియు ఉద్యమిస్తోందని తెలిపారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, డిసిఐ, షిప్‌యార్డు, బిహెచ్‌పివి వంటి అనేక ప్రభుత్వరంగ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నగా అడ్డుకున్న ఏకైక సంఘం సిఐటియు మిగతా 2లో..

బీచ్ వాక్‌లో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

రోడ్డు పక్కన మంట కాగుతున్న నగర వాసులు

## ఉదయం మంచు.. సాయంత్రం చలి

- వణుకుతున్న ఉమ్మడి విశాఖ వాసులు
- మరింతగా పడిపోనున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉమ్మడి విశాఖ వాసులను వణికిస్తోంది. చలిపులికి గజగజలాడుతూ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పూట మంచుతో బయటకు రాలేని పరిస్థితులు ఉండగా, సాయంత్రం 4 తర్వాత తీవ్రమైన చలి కొనసాగుతోంది. గడిచిన నాలుగు రోజులుగా ఈ పరిస్థితులు నెలకొన్నాయి. రానున్న కాలంలో మరింతగా ఉష్ణోగ్రతలు పడిపోనున్నాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. విశాఖ నగరంలోనూ, అనకాపల్లి, అరకు, పాడేరు ఏజెన్సీ ప్రాంతాల్లోనూ పర్యటించే సందర్శకులు చలికి భయపడిపోతున్నారు. ముందే వాతావరణ విషయం మిగతా 2లో..

### మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

▶ వార్త 8లో..

### రోడ్డు ప్రమాదంలో టెట్ అభ్యర్థి దుర్మరణం

▶ వార్త 3లో..

### మాటలతో మభ్యపెట్టి.. 'ఉక్కు'ను పాతిపెట్టే కుట్రలు

▶ వార్త 2లో..

### అజ్ఞాన అంధకారాన్ని తొలగించేదే విద్య

- రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి
- ఘనంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

▶ వార్త మెయిన్‌లో..

## 9 జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

- విశాఖ ఎకనామిక్ రీజియన్‌తో మేలు
- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రాంతంలోని తొమ్మిది జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ అంటే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకమైన అభిమానమన్నారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ జిల్లా వరకూ తొమ్మిది జిల్లాలతో విశాఖ ఎకనామిక్ రీజియన్ ఏర్పాటు చేశారన్నారు. ఉత్తరాంధ్రను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న తలంపులో ప్రభుత్వం ఉందన్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే నిర్వహించారన్నారు. వచ్చే నెలలో వైజాగ్ బీచ్ ఫెస్టివల్ నిర్వహించబోతున్నామన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై ముఖ్యమంత్రి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతం శాసన సభ్యులు పలువురు మాట్లాడుతూ ప్రపంచంలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో విశాఖ ముందంజలో ఉందన్నారు. శుక్రవారం తొమ్మిది ఐటి కంపెనీలకు శంకుస్థాపన జరిగిందని తెలిపారు. మార్చిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నామన్నారు. దీంతో విశాఖ ముఖ చిత్రం మారనుందని తెలిపారు. 2031 నాటికి 10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చేలా చర్యలు మిగతా 2లో..

మాట్లాడుతున్న మంత్రి డోలా

## నేడు బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత నావికాదళం నిర్వహిస్తున్న వైజాగ్ నేవీ మారథాన్ ఆదివారం ఉదయం 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు బీచ్ రోడ్డులోగల విశ్వప్రియ ఫంక్షన్ హాల్ నుంచి ఐఎన్ఎస్ కళింగ వరకు ఉన్నందున పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మారథాన్‌కు సుమారు 18 వేల మంది ఔత్సాహికులు 42, 21, 10, 5 కిలోమీటర్ల రన్స్‌లో పాల్గొంటారు. మారథాన్‌లో పాల్గొనే వాహనదారులు వారి వాహనాలను ఎపిఐఐసి వద్ద పార్కు చేసుకొని విశ్వప్రియ ఫంక్షన్ హాల్‌కు

## మొదటి పేజీ తరువాయి..

### ఉత్సాహంగా బీచ్ వాక్

అని గుర్తుచేశారు. ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన సిఐటియు నాయకత్వం విశాఖపట్నానికి రావడం, ఇక్కడ ఐదు రోజుల పాటు మహాసభలు జరపడం విశాఖ కార్మిక వర్గానికి ఒక వరమని అభివర్ణించారు. ఈ మహాసభలకు విశాఖ కార్మికవర్గం, ప్రజానీకం సహాయ, సహకారాలు అందించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4న విశాఖలో వేలాది మందితో జరిగే ప్రదర్శన, బహిరంగ సభలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, కెఎం.కుమార్ మంగళం, బి.జగన్, జె.అయోధ్యరామ్, పి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, అరుణ్, శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, బి.వెంకటరావు నమ్మి రమణ, మాధవి, పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### 9 జిల్లాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

తీసుకుంటున్నామని చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ సెక్టార్లు, 49 ప్రాజెక్టులు ఉంటాయని, ప్రతి మూడు నెలలకు ఒకసారి వీటిపై సమీక్ష ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, ఎపి గ్రోవర్స్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు.

### ఉదయం మంచు.. సాయంత్రం చలి

తెలిసిన వారు ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. వాస్తవానికి వాతావరణ శాఖ అధికారులు కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్షియస్ కంటే పడిపోతాయని నవంబర్‌లోనే వెల్లడించారు. ప్రస్తుతం అదే కొనసాగుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల వల్ల రాష్ట్రంలో చలి తీవ్ర పెరుగుతోంది. ఆ ప్రభావం తెలంగాణ, హైదరాబాద్‌లో ఇంకా ఎక్కువగా ఉందని తెలియజేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ చలికి, చలి గాలులకు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

**ఉష్ణోగ్రతల తగ్గుదల ఇలా.. (డిగ్రీలలో)**

| ప్రాంతం | గరిష్టం | కనిష్టం/ప్రస్తుతం |
|---|---|---|
| విశాఖపట్నం | 30 | 15 |
| అరకువేలీ | 26.3 | 3.3 |
| చింతపల్లి | 27.5 | 5.5 |
| డుంబ్రిగుడ | 27.9 | 4.1 |
| జి.మాడుగుల | 25.8 | 4.8 |
| హుకుంపేట | 26.7 | 6.7 |
| కొయ్యూరు | 28.7 | 11 |
| ముంచంగిపుట్టు | 25.1 | 4.4 |
| పాడేరు | 30 | 6.2 |

### నేడు బీచ్ రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు

చేరుకోవాలి. అక్కడి గ్రౌండ్ నిండితే ఆంధ్ర యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకొని విశ్వప్రియ ఫంక్షన్ హాలుకు రావాలి. మారథాన్ కోసం ఆర్కే బీచ్ నుండి జోడుగుళ్లపాలెం వరకు రెండువైపులా రోడ్డును, అలాగే జోడుగుళ్ల పాలెం నుండి ఐఎన్ఎస్ కళింగ వరకు బీచ్ వైపు ఉండే సింగిల్ రోడ్డును కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో నగరవాసులు, బీచ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రెసిడెంట్ వాళ్లు సహకరించాలని పోలీసాధికారులు కోరుతున్నారు. ఆదివారం ఉదయం 3 గంటల నుండి 10 గంటల వరకు బీచ్ రోడ్డుకు రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించి ప్రయాణం చేయాలని విశాఖపట్నం సిటీ అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్ విభాగం) కోరారు.

### ఎఎంఎఫ్ఐ, ఐఐఎం శిక్షణ ప్రారంభం

మాట్లాడుతున్న ప్రతినిధి

**ప్రజాశక్తి - విశాఖపట్నం :** అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్ఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవి) సహకారంతో శనివారం ఉదయం ఐఐఎమ్‌లో ఏపీ రాష్ట్ర అడాప్షన్ ప్రోగ్రామ్ కింద రాష్ట్రంలో ఉన్న కాలేజీ లెక్చరర్ల కోసం మొదటి శిక్షణా సమావేశాన్ని ప్రారంభించారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో నిర్వహించ బడిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణాత్మక, విద్యాపరంగా గ్రౌన్డేడ్ ఆర్థిక అక్షరాస్యతను విస్తరించడంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుందని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఎఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని, ఐఐఎం విశాఖపట్నం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ డీన్ (అకడమిక్స్) ప్రొఫెసర్ విజయ మారిశెట్టి, ప్రొఫెసర్ అమిత్ శంకర్, సీనియర్ విద్యావేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఆర్థిక అక్షరాస్యత, నైపుణ్యాన్ని అందించడం కోసం ఉన్నత ప్రభావ, విద్యాపరంగా ఎంకరేజ్ చేసిన మోడల్‌ను రూపొందించే లక్ష్యంతో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని స్థాపించడం ద్వారా ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపక దినోత్సవం ఎఎంఎఫ్ఐ, ఐఐఎం విశాఖపట్నం ఎమ్ఒయు జరిగింది.. శిక్షణ పొందిన లెక్చరర్లు వారి జిల్లాల్లోని విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తారు.

### మాటలతో మభ్యపెట్టి..

# 'ఉక్కు'ను పాతిపెట్టే కుట్రలు

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

'ప్రపంచంలో ఎక్కడా జరగనిది న్యూయార్క్‌లో జరుగుతుంది' అని న్యూయార్క్‌కు చెందిన షార్ట్ స్టోరీస్ రైటర్ ఒ హెన్రీ చెప్పిన మాటలు విశాఖపట్నానికి చక్కగా అమరుతున్నాయి. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు వంచన విధానాన్ని అనుసరిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని అభివృద్ధి, ఐటి, టూరిజం ఒకటేమిటి..అన్ని రంగాలకూ విశాఖను 'హబ్'గా మార్చేయడమే కూటమి ప్రభుత్వ విధానమని సిఎం చంద్రబాబు పదేపదే వల్లెవేస్తున్నారు. విశాఖలో స్టీల్‌ప్లాంట్ ఉంది.. ఆ పక్కనే మరొకటి ఆర్సెలార్ మిట్టల్ రాబోతుంది.. రాబోతుంది... అనే మాటలతో మభ్యపెడుతున్నారు. మరోవైపు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సమాధిచేసే విధానాలను అమలు చేస్తున్నారు. ఉక్కు కర్మాగారం లోపల యాజమాన్యం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేయిస్తున్నాయనడానికి తాజాగా వెలువడిన టెండర్ల ప్రక్రియనే చెప్పుకోవచ్చు. 2024 ఎన్నికల్లో ఒక్కసీటు కూడా 'కూటమి' పార్టీలు ఓడిపోకుండా ఉక్కు కార్మిక కుటుంబాలు, ఈ ప్రాంత ప్రజానీకం ఓట్లేసి గెలిపించిన తర్వాత కూడా ఉక్కును బలహీన పరిచే వ్యూహాలను ఆపడం లేదు. ఎలా అమ్మాలనే ఆలోచనతోనే 'కూటమి' నేతలు వ్యవహరిస్తూ 'తేనె'పూసిన మాటలు ఇంకా చెబుతూనే ఉన్నారు. దీంతో స్థానిక ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు, సిఎం చంద్రబాబు తీరుపై తాజాగా సర్వత్రా చర్చ

సాగుతోంది. విశాఖను చూసి దేశ రాజధాని ఢిల్లీ కుళ్లి పోయేలాగ అంటూ గతంలో చెప్పిన చంద్రబాబు తాజాగా ఢిల్లీ పోటీయే కాదని, ప్రపంచంతోనే విశాఖకు పోటీ అంటూ నగరంలో ఐటి కాగ్నిజెంట్ కంపెనీ శంకుస్థాపన సందర్భంగా పదేపదే చెప్పడం పెద్ద అతిశయోక్తే కాగలదు.

**లేదు లేదు అంటూనే ఉక్కుపై ప్రైవేట్ కార్యాచరణ ప్లాన్**

తాజాగా ఉక్కు శాఖ సహాయ మంత్రి, రాష్ట్రానికి చెందిన శ్రీనివాస వర్మ మీడియాతో మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని, విభాగాలకు ఇఒఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్) టెండర్ల ప్రక్రియ కూడా చేయడం లేదని ఈ నెల 12న బుకాయించారు. కానీ అదే రోజు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో టెండర్ షెడ్యూల్‌ను యాజమాన్యం ప్రకటించింది. పలు విభాగాల్లో వర్క్స్‌కు సంబంధించిన టెండర్లను ఆహ్వానించింది.

164 పేజీల టెండరు నోటీసును ప్రకటన చేసింది. టెండర్ల ప్రక్రియ లేదని, ప్రైవేటీరణ జరగదని, ఉత్పత్తికి ఆటంకం కలిగిస్తే చర్యలుంటాయని చంద్రబాబు కూడా మొన్నటి వరకూ చెప్పుకొచ్చారు. ఉక్కు రక్షణకు తాము కట్టుబడి ఉన్నామని ప్రజలను, కార్మికులను మభ్యపెట్టడం ద్వారా తాము అనుకున్న వారికి కట్టబెట్టే కుట్ర విధానాన్ని పారించాలన్న ఆలోచన ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది.

## సర్వైకల్ కేన్సర్‌పై అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ/విశాఖ కలెక్టరేట్ :** సర్వైకల్ కేన్సర్ వ్యాధి పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ సూచించారు. శనివారం పోలీస్ బ్యారెక్స్‌లో లయన్స్ క్లబ్, చైతన్య స్రవంతి సంయుక్తంగా ఏర్పాటు చేసిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా పోలీస్ సిబ్బంది కుమార్తెల కోసం ఉచిత హెచ్‌పివి వేక్సినేషన్ ప్రోగ్రాం చేయడం ఆనందంగా ఉందన్నారు. 9 నుండి 14 వయసులోని బాలికలు ఈ వేక్సిన్ వేసుకుంటే సర్వైకల్ కేన్సర్ బారిన పడకుండా ఉంటారన్నారు.

కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డాక్టర్ సిరిన్ రెహమాన్, రిటైర్డ్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ సరోజిని, లయన్స్ క్లబ్ సభ్యులు, ఆర్థోపెడిక్ డాక్టర్ శరత్, ఎయు మాజీ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ బి.రవిచంద్ర, అశోక్ కుమారి, ఉపాధ్యక్షులు డాక్టర్ జె విజయ్ శంకర్, ఎడిసిపిలు రాజ్ కమల్, ప్రవీణ్ కుమార్, నారాయణరావు పాల్గొన్నారు.

## మత్స్యకార కుటుంబాలకు సాయం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** బంగ్లాదేశ్ చెరలో ఉన్న విజయనగరం జిల్లా నెల్లిమర్లకు చెందిన 9 మత్స్యకార కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే, వైసిపి దక్షిణ ఇంచార్జ్ వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదుతో పాటు 25 కిలోల చొప్పున బియ్యం అందజేసి ఆదుకున్నారు. శనివారం ఆశీలమెట్ట కార్యాలయంలో నగదు పంపిణీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కుటుంబాల్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, తక్షణమే ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో 20 మంది మత్స్యకారుల్ని పాకిస్తాన్ చెర నుంచి విముక్తి కల్పించి విమానంలో తీసుకు వచ్చి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల తక్షణ సాయం అందించారు జగన్‌మోహన్‌రెడ్డి అని వాసుపల్లి కొనియాడారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా నోరుమెదపక పోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎర్నమ్మ గుడి చైర్మన్ లండ రమణ, సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు,సెక్రటరీ బొడ్డు ఆనంద్, బర్రి కొండలరావు, 37వ వైసిపి వార్డు ప్రెసిడెంట్ ఆకుల ఏసు, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంటూరు ఆనంద్, చోడిపిల్లి శివ, చేపల నూకరాజు (బుడ్డి), వేణు పాల్గొన్నారు.

## నేడు మిరియాల వెంకటరావు జయంతి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** దివంగత మిరియాల వెంకటరావు జయంతి వేడుకలను ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఏరినాలో నిర్వహిస్తున్నట్లు మిరియాల వెంకటరావు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కటారి అప్పారావు తెలిపారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం ట్రస్ట్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ,1939 డిసెంబర్ 25న రాజమండ్రిలో జన్మించిన మిరియాల, ప్రకాశం జిల్లా నేపథ్యం కలిగినా, విజయవాడలో ఎక్కువ కాలం గడిపారన్నారు. విద్యార్థి దశ నుంచే సామ్యవాద భావాలతో ఆకర్షితుడై,తర్వాత కాంగ్రెస్ పార్టీ వైపు మళ్లారని తెలిపారు.

**పాస్‌పోర్టు పోయినది**

నా పేరు **లాలం చిట్టిబాబు,** తండ్రి లాలం రామ్మూర్తి, వయస్సు 40 సం॥లు, నా పాస్‌పోర్టు నెం R2800870, నేను వేములపూడి నుంచి నర్సీపట్నం బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్య తేది. 08-12-2025న నా పాస్‌పోర్టు పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు.

**లాలం చిట్టిబాబు తండ్రి రామ్మూర్తి,
డోర్ నెం. 14-13 మెండికండి గ్రామం,
మెట్టపాలెం పంచాయతీ,
నర్సీపట్నం మండలం, అనకాపల్లి జిల్లా.
సెల్ : 7995221819**

**ఇంటి పట్టా పోయినది**

**యాకా చిన్నయ్య,** వయస్సు 85 సం॥లు, నా ఇంటి పట్టా మంజూరు పత్రం రిజిస్టర్ నెం. A034, సర్వే నెంబర్ 70/ To 73/4. మాకవరపాలెం కాంప్లెక్స్ దగ్గర తే.11-11-2025న ఇంటి పట్టా మంజూరు పత్రం పడిపోయినది. నా ఇంటి పట్టి మంజూరు పత్రం దొరికిన ఈ క్రింది అడ్రనుకు తెలియజేయగలరు.

**యాకా చిన్నయ్య, తండ్రి చిన పోతురాజు,
కొత్తపాలెం గ్రామం, రాచపల్లి పంచాయతీ,
మాకవరపాలెం మండలం, అనకాపల్లి జిల్లా
సెల్ నెం. 9059217414**

### అభివృద్ధిని చూడలేకే అవాకులు చవాకులు

**ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:** జగన్ హయాంలో గంజాయి హబ్‌గా విశాఖ మారిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఆరోపించారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, విశాఖలో జరుగుతున్న అభివద్ధిని చూసి ఓర్వలేక అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, వైసిపి ప్రభుత్వ హయాంలో విశాఖను గంజాయి హబ్‌గా మార్చారని విమర్శించారు. ఐటికి ఊటీగా విశాఖ ఊహించని అభివద్ధి చెందుతోందన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ చొరవతో దిగ్గజ ఐటి సంస్థలు విశాఖకు వస్తున్నాయని, విశాఖ ఐటీ హబ్, డేటా సెంటర్లకు కేంద్రంగా మారుతుందని తెలిపారు. నిన్న ఒక్కరోజే 9 సంస్థలకు ఇక్కడ శంకుస్థాపనలు జరిగాయని వివరించారు. ఐటి దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ శాశ్వత క్యాంపస్‌కు సిఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని, ఐటి సంస్థలు వలన యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గూగుల్ డేటా సెంటర్‌కు మార్చి నెలలో శంకుస్థాపన జరిగిందని గుర్తు చేశారు.

**IN THE HON'BLE COURT OF THE
XIII ADDL. DISTRICT JUDGE
AT : GAJUWAKA
CRL. RP MU. 14/2024**

Between :
**M/s. Multi Marine Engineering Services,** Rep. by its Prop.
Alok Kumar Rout ...Appellant
And
Hoshiar Singh Chouhan ...Respondent

**NOTICE**

To,
**Respondent:**
**Hoshiar Singh Chouhan,**
S/o. Late T.R. Chouhan,
R/at D.No. 71-31-645, Kranthinagar,
Behind Nausena Baugh, Gandhigram,
Visakhapatnam.

Please take notice that the above named Appellant herein filed a Crl. RP MU against you for setting aside the dismissal order in C.C. 274/2017 on the file of VIII ACMM, Gajuwaka, and the appeal is posted for your appearance on **30-12-2025**, therefore, you or your appointed counsel is required to attend before the above Court on **30-12-2025** at **10:30 A.M.**, in the above referred Court without fail with relevant proof, failing which the appeal will be decided in your absence in favour of the appellant.

(By Order of the Hon'ble Court).
**R. Madhu Sudan Rao & K. Alekhya**
Advocates
Visakhapatnam.
Cell: 9989632727.

## విజయవంతంగా హ్యాక్‌థాన్ పోటీలు

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం, శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో జాతీయ స్థాయి 24 గంటల 'హ్యాక్‌థాన్' పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఈ హ్యాక్‌థాన్ పోటీలకు దేశ నలుమూలల నుంచి 528 మంది విద్యార్థులు పాల్గొని తమ సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమం రెండో రోజున గీతం యూనివర్సిటీకి చెందిన ఇసిఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పోటీల్లో భువనేశ్వర్‌కు చెందిన గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ (ఆటానమస్) విద్యార్థులు మొదటి స్థానాన్ని, విశాఖపట్నం విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు రెండో స్థానాన్ని, చెన్నైకు చెందిన చెన్నై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు మూడవ స్థానాన్ని దక్కించుకున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు కళాశాల ఛైర్మన్ నడింపల్లి సత్యనారాయణరాజు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు బహుమతులుగా అందజేశారు.




విజేతలకు నగదు బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, నూతన సాంకేతికతను ప్రోత్సహించే కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని నిర్వహించేందుకు కళాశాల అన్ని విధాల కృషి చేస్తుందని చెప్పారు. అతిథులను కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శంభుప్రసాద్, సిఎంఒ డాక్టర్ పి.సుబ్బరాజు సత్కరించారు. హ్యాక్‌థాన్ ఈవెంట్ కన్వీనర్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.శివప్రసాద్‌తో పాటు ఇతర అధ్యాపకులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

## క్రమశిక్షణ, నిబద్ధత అవసరం

### బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి రెమి రజని

విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న విసి రెమి రజని

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రతి విద్యార్థీ క్రమశిక్షణ, నిబద్ధత, అంకిత భావం కలిగి ఉన్నప్పుడే ఎంచుకున్న రంగంలో లక్ష్యాన్ని చేరుకోవచ్చని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రెమి రజని స్పష్టం చేశారు. మండలంలోని మూలకుద్దు కేథరిన్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ రెమి రజని హాజరై మాట్లాడుతూ, విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులే కాదు తల్లిదండ్రులదీ బాధ్యతే అన్నారు. ఒక నాడు అవకాశాలు, పోటీతత్వం తక్కువగా ఉండేవని, నేడు పోటీతత్వానికి ధీటుగా అవకాశాలు మన ముందు ఉన్నాయని చెప్పారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించిన వారికి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులను సత్కరించారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఇవాంజలిన్ రాయి, కరస్పాండెంట్ ఆలివర్ రాయి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## ఘనంగా అమేయ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అమేయ వరల్డ్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయనగరం మహారాజా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ రమేష్ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో క్రీడల్లోనూ పాల్గొనాలని సూచించారు. అమేయ పాఠశాలలో మంచి వాతావరణం విద్యార్థి మానసిక శక్తిని పెంపొందిస్తుందన్నారు. ప్రిన్సిపల్ శ్రీదేవి మహంతి పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. డైరెక్టర్ మోహన్ మండవ పాఠశాల విజయాల కోసం కృషిచేస్తున్నామని చెప్పారు. మేనేజర్, కరస్పాండెంట్ పి.అరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిని ప్రిన్సిపల్, డైరెక్టర్ సత్కరించారు. విద్యార్థులు దేశభక్తిని కలిగించే కార్యక్రమాలను ప్రదర్శించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నృత్య ప్రదర్శనలిస్తున్న చిన్నారులు

## విద్యాశాఖ యాక్షన్‌ప్లాన్ అమలుపై సమీక్ష

ప్రజాశక్తి - ఆరిలోవ : యాక్షన్ ప్లాన్ అమలుపై జిల్లా విద్యాశాఖాధికారులతో విశాఖపట్నం జిల్లా స్పెషల్ ఆఫీసర్, కెజిబివి సెక్రటరీ డి.దేవానందరెడ్డి శనివారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి, అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్షా విభాగంలోని సెక్టోరియల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవానందరెడ్డి మాట్లాడుతూ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా అమలవుతున్న 75 రోజుల యాక్షన్ ప్లాన్, 6 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం సమ్మరీ వీడియోల వినియోగం, 10వ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. జిల్లాలోని 506 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 5వ తరగతి వరకు 25,170 మంది విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్‌పై బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించగా, వారి అభ్యాస స్థాయిని ఆధారంగా తీసుకొని స్టై, మౌంటైన్, స్ట్రీమ్ విభాగాలుగా వర్గీకరించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి మూడు ప్రాథమిక పాఠశాలలకు ఒక అడాప్టెడ్ ఆఫీసర్‌ను నియమించి, ఆయా అధికారులు ప్రతి 20 రోజులకు ఒకసారి మొత్తం మూడు సార్లు పాఠశాలలను సందర్శించి 75 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు విధానాన్ని పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయి హైస్కూళ్లను ఎంఇఒ -1, ఎంఇఒ -2లుగా విభజించి 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మరీ వీడియో ప్రదర్శనను సమర్థవంతంగా అమలు చేసే బాధ్యతలను ఎంఇఒలు తీసుకోవాలని చెప్పారు. 10వ తరగతి విద్యార్థుల కోసం అమలులో ఉన్న 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

## ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 8వ వార్డు పరిధిలోని ఎండాడ రాజీవ్‌నగర్ కాలనీలో శనివారం శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సిమ్స్) ఆధ్వర్యంలో విద్యార్థులు ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిమ్స్ ఎన్ఎస్ఎస్ అధికారి జి.సుధాకర్ మాట్లాడుతూ, స్థానికుల్లో పరిశుభ్రమైన పరిసరాలు, పౌర బాధ్యత, సమాజ అవగాహనను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిశుభ్రత, సామాజిక బాధ్యతపై సందేశాలను వ్యాప్తి చేసే ప్లకార్డులను పట్టుకుని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్వహించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.

## యుటిఎఫ్ భీమిలి కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -తగరపువలస : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) భీమినిపట్నం మండల శాఖ 2025-26 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికైంది. చిట్టివలస యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం మండల కౌన్సిల్ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎ.పైడిరాజు, ఎం.రామకృష్ణ వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా ఆర్.ఆదియ, అధ్యక్షులుగా ఎల్.వి.శ్రీనివాస రావు, సహాధ్యక్షులుగా రామకృష్ణ, వి.అరుణ, జి.మహేష్, కార్యదర్శులుగా పి.సంతోష్, డి.ప్రసాద్, కె.మురళి, ట్రెజరర్‌గా శ్రీనివాసరావు, కన్వీనర్‌గా కె.శ్రీనివాసరావు, కో-కన్వీనర్‌గా బి.ఈశ్వరరావు, మహిళా కార్యదర్శి జి.వనజ ఎన్నికయ్యారు.

## హైజంప్‌లో కోదండ రామస్వామికి బంగారు పతకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల బికాం తృతీయ సంవత్సరం విద్యార్థి ఎ.కోదండరామస్వామి హైజంప్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ, ఫిజికల్ డైరెక్టర్ పి.గౌరీశంకర్ తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఎయులో జరిగిన ఎయు ఇంటర్ కాలేజియేట్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థి బంగారు పతకం సాధించడం తమ కళాశాలకే గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.విష్ణుమూర్తి, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ బి.ప్రసాదరావు, అధ్యాపకులు అభినందించారు.

## తగరపువలస లోపల నుంచి బస్సులు నడపాలి

ప్రజాశక్తి- తగరపువలస: శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే ఆర్‌టిసి బస్సులను తగరపువలస గ్రామం లోపల నుంచి నడిపేలా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కృషిచేయాలని సిపిఐ ఏరియా కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి వోర అప్పలరాజు, చిట్టివలస జ్యూట్ మిల్ పెన్షన్ సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర్ బాబాజీ కోరారు. చిట్టివలసలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, శ్రీకాకుళం విజయనగరం బస్సులు బైపాస్ మీదుగా వెళ్లిపోతుండటంతో తగరపువలస ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్‌టిసి ఆర్ఎంతో మాట్లాడి బస్సులను అంబేద్కర్ సెంటర్ మీదుగా నడపాలని కోరారు. తగరపువలసలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు.

## వైద్య విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 15న ర్యాలీ

ప్రజాశక్తి- ఆనందపురం : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని భీమిలి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఆనందపురం వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా వైద్యం ప్రజల హక్కు అనే నినాదంతో వైద్య విద్య ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సేకరించిన కోటి సంతకాల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తైనాల విజయ్‌కుమార్, సిరి సహస్ర, వాసురాజు, గన్‌రెడ్డి శ్రీనివాసరావు, బంక సత్యం, మజ్జి వెంకట్రావు, బోని అప్పలనాయుడు, చందక సూరిబాబు, పాండ్రంకి శ్రీను, షినగం దామోదర్‌రావు, కోరాడ మునలినాయుడు, చందక అప్పలస్వామి, రాంజీ, రౌతు శ్రీను, సాడి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### మూడు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని అయినాడ పంచాయతీ పరిధి యాతపేట వీధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన చొక్కా కుమారి, గుడ అప్పన్న, గొడ్డు కృష్ణమ్మకు చెందిన ఇళ్లలోని సామాన్లు మొత్తం కాలిపోయాయి. పొలం పనులకు వెళ్లిన ఈ వ్యవసాయ కూలీలు కట్టుబట్టలతో మిగిలారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని నష్టపరిహారాన్ని పరిశీలించారు. వీరికి స్కీమ్ కింద ఇళ్లు మంజూరుకావడంతో కట్టుకునేందుకు డబ్బులు తెచ్చి ఇంటిలో పెట్టారు. రెండు కుటుంబాల ఇళ్లలో రూ.2 లక్షలు చొప్పున, మరొకరి ఇంటిలో రూ.3 లక్షలు ఈ ప్రమాదంలో కాలిపోయాయి. మొత్తం రూ.8 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు మండల ఆర్ఐ శ్యామల, విఆర్ఒ గుర్తించారు. విషయం తెలుసుకున్న భీమిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.రామస్వామినాయుడు, మామిడి శివ బాధితులను పరామర్శించారు.

### మందు బాబులకు జరిమానా

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మందు తాగి వాహనాలు నడిపిన 185 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి నిందితులను భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రహదారి భద్రత కోసం ప్రతి వాహనదారుడూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

### దొంగతనం కేసులో 17 నెలల జైలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దొంగతనం కేసులో నిందితుడికి న్యాయస్థానం 17 నెలల జైలు శిక్ష విధించిందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. 2024 మార్చి 30న ములకలాపల్లిలో జరిగిన చోరీ కేసులో గాజువాకకు చెందిన నమ్మి శ్రీకాంత్ (25)ను దోషిగా నిర్ధారిస్తూ చోడవరం కోర్టు 17 నెలల జైలు శిక్ష విధించిందని తెలిపారు. నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో టెట్ అభ్యర్థి దుర్మరణం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : టెట్ పరీక్ష రాసేందుకు తండ్రి ఆటలో వెళ్తున్న అభ్యర్థి ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన సంఘటన అనకాపల్లిలో శనివారం చోటుచేసుకుంది. విశాఖపట్నం ఎన్ఎడి ప్రాంతంలో నివాసముంటున్న బోకర సునీత (25) టెట్ పరీక్ష రాసేందుకు ఆటో డ్రైవర్ అయిన తన తండ్రి లక్ష్మణరావు ఆటోలో శనివారం వెళ్తున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా వెళ్తున్న వారు అనకాపల్లి జాతీయ రహదారి వద్ద దారి తప్పామేమోనని సునీత తండ్రికి చెబుతున్న సమయంలో ముందు ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో ఆటోలో కూర్చున్న సునీత రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై దుర్మరణం చెందింది. తండ్రి లక్ష్మణరావుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సిఐ వెంకట నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా సత్యాల సాగరిక

ప్రజాశక్తి - ఆరిలోవ : వైసిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిగా 13వ వార్డుకు చెందిన సీనియర్ నాయకురాలు సత్యాల సాగరిక నియమితులయ్యారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సత్యాల సాగరిక మాట్లాడుతూ, పార్టీకి చేసిన సేవలను గుర్తించి తనకు పదవి ఇచ్చిన అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా అధ్యక్షులు కెకె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావుకు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

## అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో నియోజకవర్గ అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లను ప్రభుత్వ విప్ గణబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లల పట్ల అంగన్‌వాడీలో బాధ్యతతో మెలగాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ, కూటమి నేతలు నారిపిన్ని సత్తిరాజు, బొడ్డేటి విజయ్, పట్నాల అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నిత్యావసరాలను అందిస్తున్న దొడ్డి కిరణ్ తదితరులు

## పేద కుటుంబానికి వితరణ

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డు పరిధి ఆదర్శనగర్‌లో నివాసముంటున్న వాసుపల్లి సత్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న వైసిపి యూత్ వింగ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, డికె ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్ నెలకు సరిపడా రేషన్ సరుకులను ఆమెకు అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు సాయి, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమావేశాలు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శనివారం పూర్వవిద్యార్థుల సమావేశాలు ఉత్సాహంగా జరిగాయి. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన పూర్వవిద్యార్థుల సమావేశంలో విభాగ పూర్వవిద్యార్థులు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరై విభాగ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విభాగ మెదటి బ్యాచ్ విద్యార్థి బ్రాహ్మణయ్యను సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సివిఎన్‌వి సత్యనారాయణ రెడ్డి, విభాగ ఆచార్యులు, విశ్రాంత ఆచార్యులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ విభాగంలో నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమావేశానికి అమెరికాలో స్థిరపడిన పూర్వవిద్యార్థి డాక్టర్ దేవ హెచ్ పురాణం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎయులో విద్యార్థి దశ నుంచి నేడు అమెరికాలో ఉన్నతంగా స్థిరపడటంలో తన కష్టాన్ని విద్యార్థులకు వివరించారు. ఉన్నత లక్ష్యాలను స్థిరపరచుకుని ముందుకు సాగాలన్నారు.

జర్నలిజం విభాగంలో నిర్వహించిన సమావేశంలో విభాగం తొలి బ్యాచ్ విద్యార్థి డి.శేషపద్మ ముఖ్య అతిథిగా హాజరై విలువలను నిలుపుకుంటూ మీడియా రంగంలో కొనసాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సిఎం.వినయ్‌కుమార్, ఆచార్య చల్లా రామకృష్ణ, విజయలక్ష్మి, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.70 లక్షలు విరాళం అందించిన దేవ పురాణం

ఎయు పూర్వవిద్యార్థి డాక్టర్ దేవ పురాణం వర్సిటీ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో రూ.70 లక్షలు విరాళాన్ని విసి ఆచార్య జిపి.రాజశేఖర్ సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబుకు అందజేశారు. విశ్వవిద్యాలయం మౌలిక వసతులు, సుందరీకరణకు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు రూపంలో ఈ నిధులను వినియోగించాలని దేవ పురాణం కోరారు.

రూ.70 లక్షలు విరాళం అందిస్తున్న దేవపురాణం

# రాజీ ఉత్తమ మార్గం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు**

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : రాజీ ఉత్తమ మార్గమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, కక్షిదారులకు సత్వర న్యాయం అందించే ఏకైక మార్గం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని తెలిపారు. శాశ్వతమైన పరిష్కార ఫలాలను అందించే రాజీమార్గాన్ని కక్షిదారులు ఎంచుకోవాలని సూచించారు. కాలయాపన లేకుండా సత్వర న్యాయాన్ని పొందడానికి ఈ ప్రక్రియ ఎంతో మేలు కలిగిస్తుందని చెప్పారు. ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు విశేష స్పందన లభించిందన్నారు. రాజీకి అనుగుణంగా 25 వేల పైచిలుకు కేసులను గుర్తించి, మూడు జిల్లాల పరిధిలో 43 ప్రత్యేక బెంచీలను ఏర్పాటుచేసినట్లు వివరించారు. జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ, లోక్ అదాలత్‌తో తొలిసారిగా రెండు కేసుల్లో రెండు కోట్ల రూపాయలు పరిహారం అందించినట్లు వివరించారు. ఐసిఐసిఐ బ్యాంక్, ద న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీల ద్వారా రూ.కోటి 90 లక్షలను బాధితులకు అందజేశారు. ఏడవ అదనపు జిల్లా కోర్టులో రూ.40 లక్షలు, 12వ అదనపు జిల్లా కోర్టులో రూ.కోటి 50 లక్షలు పరిహారంగా అందజేశారు. తొలిసారిగా భారీ మొత్తంలో పరిహారాన్ని వినియోగదారులకు అందించి న్యాయస్థానాలకు సహకరించిన బీమా కంపెనీలకు కార్యదర్శి సన్యాసినాయుడు అభినందిస్తూ లేఖలు అందజేశారు.

**భీమునిపట్నం :** స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పి.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న 1109 కేసులు పరిష్కారమైనట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది, లోక్ అదాలత్ సభ్యులు పార్వతీశం, శంకర్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జనార్దనరావు, మంజుల పాల్గొన్నారు. లోక్ అదాలత్ ప్రాధాన్యతను ముందుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య వివరించారు.



పరిహారం చెక్కును అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు

# కిమ్స్ ఐకాన్‌లో గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి -గాజువాక : శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో 2004 నుంచి ఇప్పటివరకు 3వేలకు పైగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు చేసినట్లు ప్రముఖ దంత వైద్య నిపుణుడు, మాక్సిలో ఫేషియల్ సర్జన్ డాక్టర్ వైఎస్ఎన్.రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రహణం మొర్రి పుట్టుకతోనే వచ్చే సమస్య అని పేర్కొన్నారు. 15 రోజుల వయసున్న పిల్లల నుంచి 66 ఏళ్ల వయసున్న పెద్దల వరకు ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేశామని వివరించారు. అమెరికాకు చెందిన దోషి స్మైల్స్ సంస్థ వైద్యులు డాక్టర్ నితిన్ దోషి, డాక్టర్ లీనా దోషి స్థాపించిన ఇంగా ఫౌండేషన్ ద్వారా కిమ్స్ ఐకాన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి బలరామ్ ఈ కార్యక్రమానికి అండదండలు అందించారని చెప్పారు. ఈ బ్యానర్ కింద శస్త్రచికిత్సలను పేదలకు పూర్తి ఉచితంగా చేసేమని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణశ్యామారావు, ఇంగా ఫౌండేషన్ ట్రస్టీ డాక్టర్ చేతన్ కుమార్, అసోసియేషన్ ఆఫ్ మాక్సిలోఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.మణికందన్, ఎఒఎంఎస్ఐ ఎపి చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ పి.వసుంధర్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌రాజు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఆపరేషన్స్ జనరల్ మేనేజర్ మమతా దేవిరెడ్డి పాల్గొన్నారు.

వైద్యసేవలందిస్తున్న సిబ్బంది

## 'లయన్స్'లో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధారలోని లయన్స్ కేన్సర్, జనరల్ హాస్పిటల్ ప్రాంగణంలో మల్టీ-స్పెషాలిటీ హెల్త్ క్యాంప్ నిర్వహించి 90 మంది రోగులను పరీక్షించారు. జనరల్ సర్జన్ డాక్టర్ మోహన్ పాత్రో, డెర్మటాలజిస్ట్ మాల సరనాధన్, యూరాలజిస్ట్ అనురాగ్ జోష్, గైనకాలజిస్ట్ శారద, ఇఎన్‌టి స్పెషలిస్ట్ ఎస్.సుశ్రుత, జనరల్ ఫిజీషియన్ సురేష్, న్యూట్రిషనిస్ట్ టి.కిరణ్మయి, మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కల్యాణ్ ప్రసాద్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ప్రసాద్ వైద్య సేవలందించారు. శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన రావడంతో క్రమం తప్పకుండా ఇటువంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తామని లయన్స్ కేన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు తెలిపారు.

# పౌరగ్రంథాలయంలో హెచ్ఆర్ మీట్

హెచ్‌ఆర్ మీట్‌లో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి-సీతమ్మధార : హెచ్‌ఆర్ క్లబ్ చారిటబుల్ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పౌర గ్రంథాలయంలో హెచ్‌ఆర్ మీట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ (కడప) డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నిరావు పాల్గొని ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌పై వివరించారు. హెచ్‌ఆర్ కన్సల్టెంట్ రాధాకృష్ణ ఇండియన్ లేబర్ కోడ్స్‌ను వివరించారు. ఇఎస్‌ఐసి బ్రాంచ్ మేనేజర్ రఘునాథ్ సోషల్ సెక్యూరిటీ కోడ్‌పై ఆడియో సందేశం పంపారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు కొత్తపల్లి శివవరుణ్ నాయకత్వంలో జరిగిన సమావేశంలో ఔషధ, రసాయన, ఐటి, సేవా రంగాల హెచ్‌ఆర్ నిపుణులతో పాటు ఆండి వీల్స్‌మార్ట్ హెచ్‌ఆర్ హెడ్ కిరణ్, అతని బృందం సభ్యులు పాల్గొన్నారు.

## అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శుభేందు సమంత కుటుంబ సభ్యులతో, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు సుధా నారాయణమూర్తి వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి సంప్రదాయాల ప్రకారం ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సింగం రాధ, పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. వారంతా ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి ఆలయ వేద పండితులు వేద ఆశీర్వచనము ఇచ్చి, స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి పోటో, ప్రసాదాలను అధికారులు అందజేశారు.

సుధామూర్తికి అప్పన్న చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

# నీరు, విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి- పెందుర్తి: జివిఎంసి 97వ వార్డు పరిధి చిన్నముషిడివాడ ద్రోణంరాజునగర్‌లో ప్రజలకు నీరు, విద్యుత్ వాడకంపై ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 విద్యార్థులు అవగాహన కల్పించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన స్పెషల్ క్యాంప్ రెండో రోజు విజయవంతంగా సాగింది. నీరు వృథా చేయొద్దు, విద్యుత్‌ను ఆదా చేయండి అనే నినాదాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.సంధ్యారాణి ఆధ్వర్యాన జరిగిన క్యాంప్‌లో పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు చేపట్టిన చర్యలను ఆదర్శ్ కాలేజ్ కరస్పాండెంట్ సెక్రటరీ టి.థియోఫిలస్ అభినందించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఆదర్శ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

# జగన్మోహన్ రెడ్డిని కలిసిన పతివాడ దంపతులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు ఆధ్వర్యాన 10వ వార్డు వైసిపి అధ్యక్షులు పతివాడ కనకరాజు ఆయన సతీమణి రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి పతివాడ వెంకటలక్ష్మి వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పతివాడ దంపతులు మాట్లాడుతూ, పార్టీ అధ్యక్షులు, పెద్దలు తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

# కశింకోట పంచాయతీ కార్మికుల సమ్మె

## 4 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్

**ప్రజాశక్తి-కశింకోట** : కశింకోట గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బకాయి పడ్డ నాలుగు నెల వేతనాలు చెల్లించాలని కోరుతూ ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కార్మికులు సమ్మె బాటపట్టారు. ఈ సందర్భంగా శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీతాల సమస్యను ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శికి సెప్టెంబర్ 12వ తేదీనే విన్నవించామని, సమ్మె చేసే పరిస్థితి రాకుండా వేతనాలు ఇవ్వాలని ముందస్తు సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. అయినా కూడా పట్టించుకోకపోవడంతో జీతాల కోసం విధిలేని పరిస్థితుల్లో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలుగు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, రక్షణ పరికరాలు, పనిముట్లు, యూనిఫారం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ వర్కర్లందరికీ వర్తింపజేయాలని, కార్మికులపై కక్ష సాధింపు చర్యలు, తొలగింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు కొండబాబు, దేవుడు, ఆదిలక్ష్మి, అప్పల నరసమ్మ, అర్జునమ్మ, సన్యాసమ్మ, అప్పలకొండ, నూక రత్నం, రామారావు, లక్ష్మణ, సూరిబాబు, మాలి నాయుడు, అప్పలరాజు, సత్యారావు, పెద్ద అప్పారావు, గురయ్య, అబ్బులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

### ఎయు అథ్లెటిక్ పోటీల్లో ఎఎంఎఎల్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-అనకాపల్లి** : ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 11, 12 తేదీలలో జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలలో ఎఎంఎఎల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. జి.జయబాబు తెలిపారు. టి.చంద్రశేఖర్ డిస్కస్ త్రో, జావలిన్ త్రోలలో గోల్డ్ మెడల్స్, ఎం.గణేష్ 10,000 మీటర్స్ రన్నింగ్‌లో సిల్వర్ మెడల్, పి.శివ హేమర్ త్రో‌లో బ్రాంజ్ మెడల్, వి. భార్గవి 10,000 మీటర్స్ రన్నింగ్‌లో బ్రాంజ్ మెడల్ సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలను ఎగరవేశారని పేర్కొన్నారు. పై క్రీడాకారుల విజయం పట్ల కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేరాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు, వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్ కుమార్, జిబి సభ్యులు వాసిరెడ్డి బాలకృష్ణ, కాండ్రేగుల రవీంద్ర, ఉద్దగిరి కృష్ణ కిషోర్, సూపరింటెండెంట్ పి.అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎస్.నాయుడు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ కె.శత్రుఘ్న, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, కళాశాల సిబ్బంది అభినందించారు.

### చౌడు నేలలకు ఎంసిఎం 103 రకం అనుకూలం

**ప్రజాశక్తి-యలమంచిలి టౌన్** : చౌడు నేలలకు ఎంసిఎం 103 రకం వరి అనుకూలంగా ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. యలమంచిలి మున్సిపాలిటీ సోమలింగపాలెంలో బిసిటీ కెవికె ద్వారా ఇవ్వబడిన చౌడుని తట్టుకునే వరి రకం ఎంసిఎం103 పంటను క్షేత్ర స్థాయిలో శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిసిటీ కెవికె సీనియర్ సైంటిస్ట్ కె.శైలజ, సోయిల్ సైంటిస్ట్ శ్రీహరిరావు, సస్య రక్షణ సైంటిస్ట్ నాగేంద్ర ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి మోహనరావు, రైతులు పాల్గొన్నారు.

### ఎట్టకేలకు రోడ్డు మరమ్మతులు

**ప్రజాశక్తి-సబ్బవరం** : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ జంక్షన్ నుండి పాత సబ్బవరం వరకు సబ్బవరం-చోడవరం ఆర్ అండ్ బి రోడ్డులో శనివారం మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డులో గుంతలు పడడంతో ద్విచక్ర వాహనదారులకు, ఆటోలు, బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ అండ్ బి అధికారులు శనివారం గుంతలను పూడ్చి మరమ్మతులు చేశారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

### అన్నమాచార్య సంగీత పీఠం వ్యవస్థాపకులు సుబ్బలక్ష్మి మృతి

**ప్రజాశక్తి-చోడవరం** : చోడవరానికి చెందిన ప్రముఖ సాహితీ సంగీత అన్నమాచార్య సంగీత పీఠం వ్యవస్థాపకులు ఎం.సుబ్బలక్ష్మి (86) చోడవరంలోని ఆమె స్వగృహంలో శనివారం కన్నుమూశారు. చోడవరం ప్రాంతంలో సంగీత సాహిత్యాలలో ఎక్కువమంది శిక్షణ పొందాలని ఆమె ఆకాంక్షించేవారు. అదే నేపథ్యంలో ఆమె పీఠాన్ని ఏర్పాటు చేసి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. తమ సొంత నిధులను ఖర్చుచేసి ఎంతోమంది సంగీత సాహిత్య ప్రముఖులను చోడవరం రప్పించడంలో ఆమె పాత్ర ఉండేది. కొంతమంది శిష్యగణాన్ని తయారు చేసుకుని, నిరంతరం ఏదో కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఆమె భౌతికకాయానికి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.

సుబ్బలక్ష్మి (ఫైల్‌ఫోటో)

### ప్రశాంతి పాలిటెక్నిక్‌లో హస్తకళల ప్రదర్శన

**ప్రజాశక్తి-అచ్యుతాపురం** : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో శనివారం హస్తకళల ప్రదర్శన నిర్వహించారు. జాతీయ హస్తకళల వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం విద్యార్థులను, మహిళలను ఆకట్టుకుంది. ఎంబ్రాయిడరీ జువెలరీ డిజైన్స్, స్వదేశీ సాంకేతిక రంగులతో కూడిన బొమ్మల తయారీ, వెదురు అల్లికలు, లక్క బొమ్మలు వంటి వాటిని ప్రదర్శించారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా మహిళల ఆర్థిక స్వావలంబన కొరకు హస్తకరల ప్రముఖ పాత్ర వహిస్తున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-వడ్డాది** : బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేయాలన్నారు. మొదటి రకం ధాన్యానికి క్వింటాకు రూ.2389, గ్రేడ్-2 రకానికి రూ.2369 చొప్పున మద్దతు ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు ఎంవివి సత్యనారాయణ, సర్పంచ్ కె.కామలక్ష్మి, ఈవో లవరాజు, కూటమి నాయకులు దొండా సన్యాసిరావు, శిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, దొండా గిరిబాబు, సింగంపల్లి రమేష్, సయ్యపురెడ్డి శ్రీనివాసు, సూరాతి పేరమ్మ, కబిరెడ్డి వెంకటరావు, వీర్ల సురేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

## పెన్షన్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

### ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నేతలు దుర్గారాణి, సుబ్బలక్ష్మి

ప్రభుత్వ ఉత్తర్వులు చూపుతున్న అంగన్వాడీ నేతలు

**ప్రజాశక్తి-అనకాపల్లి** : అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలో 35 మంది అంగన్వాడీలకు పెన్షన్ డ్యూటీలు వేస్తున్నారని, దీని నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు దుర్గారాణి, నాయకులు సుబ్బలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంబంధిత జీవోను శనివారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. వాలంటీర్ వ్యవస్థను తొలగించడంతో అంగన్వాడీ వర్కర్లకు పెన్షన్ డ్యూటీలు వేశారని, అప్పటి నుంచి పెన్షన్లు పంపిణీ చేస్తుండగా ఆగస్టు నెలలో అంగన్వాడీ వర్కర్లకు పెన్షన్ డ్యూటీ నుండి మినహాయింపు ఇస్తూ రాష్ట్ర డైరెక్టర్ నుండి సర్క్యులర్ ఇచ్చారని తెలిపారు. దీంతో రాష్ట్రంలో అన్నిచోట్ల అంగన్వాడీ వర్కర్లకు పెన్షన్ డ్యూటీ నుండి మినహాయింపు ఇచ్చారని, అయితే దీనికి విరుద్ధంగా ఎస్ రాయవరం మండలంలో 35 మంది అంగన్వాడీ వర్కర్లకు పెన్షన్ డ్యూటీలు బలవంతంగా వేస్తున్నారని పేర్కొన్నారు. సర్క్యులర్ చూపించినా స్థానిక ఎంపీడీవో తప్పనిసరిగా చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. అంగన్వాడీలకు ఆన్లైన్ పనులు, ప్రీస్కూల్ డ్యూటీలు వంటి అనేక విధులు ఉన్నాయని, నెల ప్రారంభంలోనే టిహెచ్ఆర్ ఇచ్చే డ్యూటీ ఉందని, దీని నుండి తక్షణమే మినహాయింపు ఇవ్వాలని ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా అధికారులు స్పందించడం లేదని వాపోయారు. వచ్చే నెల నుంచి పెన్షన్ డ్యూటీకి అంగన్వాడీలు మినహాయింపు ఇవ్వాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## జాతీయ స్థాయి పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థుల ఎంపిక

**ప్రజాశక్తి-పాయకరావుపేట** : అస్సాం రాజధాని గువాహటిలో ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న 'అష్టలక్ష్మి దర్శన్, యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం' పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఏపి నుంచి 20 మంది విద్యార్థులకు ఆహ్వానం అందగా, వారిలో స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పైలా మణికంఠ, కెఎన్ఎస్ఎస్ నరేంద్ర ఉన్నారు. వీరంతా మన రాష్ట్రానికి సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలను అక్కడ ప్రదర్శిస్తారు. తెలుగుదనం ఉట్టిపడేలా వస్త్రధారణ చేయనున్నారు. వీరు ఎంపిక పట్ల శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, విద్యా సంస్థల అధినేత సిహెచ్‌వికె.నరసింహారావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఎంపికైన మణికంఠ, నరేంద్ర

## ముగిసిన ఎఐ శిక్షణ

**ప్రజాశక్తి-అనకాపల్లి** : స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో శ్యాంసంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృత్రిమ మేధస్సు శిక్షణ ముగింపు శనివారం జరిగింది. కళాశాలకు చెందిన ఫైనల్ ఇయర్ విద్యార్థులు 150 మంది ఇందులో పాల్గొన్నారు. శ్యాంసంగ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఆధునిక నైపుణ్యాలు, ప్రతి విద్యార్థికి ప్రత్యేక కిట్లు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు భవిష్యత్ ప్రపంచాన్ని నిర్ణయించే కీలక రంగమని, విద్యార్థులు ఏఐ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. డేటాప్రో జనరల్ మేనేజర్ కిషోర్ వర్మ, ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్స్ కౌన్సిల్ అఫ్ ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య విభాగం వైస్ ప్రెసిడెంట్ సరోజ్ కుమార్ మాట్లాడుతూ, "నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే నిరంతరం నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ హేమంత్ కుమార్, కళాశాల చైర్మన్ ముఖ్య అతిథులను దుప్పాలువలు కప్పి జ్ఞాపిక బహూకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఈఎస్ఎస్ సిఐ ప్రతినిధులు, డేటాప్రో సంస్థ ప్రతినిధులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-యలమంచిలి టౌన్** : యలమంచిలి డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం ఉపాధ్యాయుల జోనల్ / డివిజనల్ స్థాయి క్రీడా పోటీలను స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో 12 మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు అత్యంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. మహిళా ఉపాధ్యాయులు త్రోబాల్, పురుష ఉపాధ్యాయులు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జట్లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ పెన్నాడ అప్పారావు, ఎస్టిఎఫ్ కార్యదర్శి నాయుడు, ఎంఇఒలు ఐఎస్ సూర్యప్రకాశ్, అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు అంజాద్, రాజశేఖర్, ఎంపీపీ రాజాన శేషు, బొద్దపు శ్రీనివాసరావు, కొక్కిరపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు గోపినాథ్, సన్యాసి నాయుడు, నక్క శివ శంకర్, నగిరెడ్డి అచ్యుత పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కూటమి పార్టీల నాయకులు

## ప్రజా దర్బార్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూటమి పార్టీల నాయకులు పేర్కొన్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుండాల జంక్షన్ దరి ఆర్‌అండ్‌బి ఆఫీస్‌లో స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ప్రభుత్వ అధికారులతో కలిసి ప్రజాదర్బారు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలును తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తుమ్మపాల ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు కర్రి వెంకట సన్యాసినాయుడు (బాబి), సిహెచ్‌ఎన్ అగ్రహారం పిఎసిఎస్ చైర్మన్ బంటు రవి, క్లస్టర్ నాయకులు బత్తుల రమేష్, తలారి కాశీనాయుడు, మామిడిపాలెం సర్పంచ్ పూడి వరదేశ్ నాయుడు, కొసిరెడ్డి త్రినాథ్, కూండ్రం సర్పంచ్ నందారపు సూరిబాబు, గొర్లి ప్రసాదు, బొబ్బిలి రాజు, ఉప్పులూరు అప్పలనాయుడు, కల్లూరు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలెం గౌరీ పరమేశ్వరి కమిటీ, వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల కమిటీ, కుంచా వారి గౌరీ పరమేశ్వరి కమిటీల సభ్యులు శనివారం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను కలిశారు. త్వరలో నిర్వహించే గౌరీ పరమేశ్వరుల జాతరల గురించి వివరించారు. జాతర నిర్వహణకు గల ఇబ్బందులను తెలియజేసి వినతపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ కొన్ని వందల సంవత్సరాలుగా ఎంతో వైభవంగా జరుగుతూ అనకాపల్లి కీర్తి ప్రతిష్టలు పెంపొందించే విధంగా నిర్వహించే ఈ జాతరలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## లోక్ అదాలత్‌లో 1042 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : యలమంచిలి కోర్టులు సముదాయంలో జడ్జిలు పి.విజయ, జి.స్పందన, కె.రమేష్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 1042 కేసులు పరిష్కరించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.సత్యనారాయణ, ఎల్‌వి.రామకృష్ణారావు, డి.వెంకటరావు, పివి.రమణ, బి.హరిశంకర్‌రావు, సభ్యులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

## వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని పోలేపల్లిలో శనివారం గౌరీ పరమేశ్వరుల మహోత్సవం వైభవంగా జరిగింది. వేకువ జాము నుండే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎడ్ల పరుగు పందెం పోటీలు, బైక్ స్లో పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

మునగపాక : మండలంలోని నాగులపల్లి, గుణపర్తి గ్రామాలలో గౌరి పరమేశ్వరుల మహోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర నాగులపల్లి గౌరి పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యల్లపు వెంకట భాస్కర్, పెత్తకంశెట్టి రాజు, పోలవరపు త్రినాథ్, ఆకుల నానాజీ, పైల గోపి, మళ్ల నాయుడు, పాల్గొన్నారు.

పోలేపల్లిలో అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

# ఆక్రమణదారులకు రెవెన్యూ సహకారం

## సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి రెవెన్యూ సర్వే నెంబరు 280/1, 281/1, 281/2లో గల ప్రభుత్వ భూముల ఆక్రమణకు రెవెన్యూ అధికారులే సహకారం అందించారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కోర్టు వివాదాలో ఉన్న ఈ ప్రభుత్వ భూములకు ఫారం 3 ఇచ్చారని, రెవెన్యూ రికార్డుల్లో లేని భూములకు పాస్ బుక్కులు మంజూరు చేశారని, తప్పుడు రికార్డులు సృష్టించి కోర్టుకు వెళ్ళడానికి రెవెన్యూ అధికారులు సహకారాన్ని అందించారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో రెవెన్యూ అధికారులు పని చేస్తున్నారని, కోర్టు తీర్పులను రెవెన్యూ అధికారులు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. వాస్తవంగా ఈ భూములన్నీ ఎస్‌ఎఫ్‌ఏలో ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయన్నారు. అయితే ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది సర్వే నెంబర్ 281/2లోని సుమారు 6.88 ఎకరాల భూమికి 281/2ఏ అని తప్పుడు రికార్డులు సృష్టించారని, సర్వే నెంబరు 280/1లో 3.63 ఎకరాల భూమిని క్షేత్రియ దేవి సింగ్ అనే వ్యక్తికి అసైన్ చేయగా ఆ భూమిని ఆక్రమించారని, ఈ మొత్తం భూమిలో పామాయిల్ తోటలు వేశారని తెలిపారు. సర్వే నెంబర్ 281/1లోని భూములను కూడా ఆక్రమించి సాగు చేస్తున్నారన్నారు.

మాట్లాడుతున్న వెంకన్న

ఈ భూములపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దర్యాప్తు చేసి ప్రభుత్వ భూములుగా నిర్ధారించి స్వాధీనం చేసుకోగా, ఆక్రమణదారుడు కోర్టుకు వెళ్లారని తెలిపారు. నాటి నుండి ఈ భూములు విఆర్‌ఓ పర్యవేక్షణలో ఉండగా, ఆక్రమణదారుడు యథేచ్ఛగా పామాయిల్ పంటను తీసుకుపోతున్నాడని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆ ప్రాంతంలో నూతనంగా గెస్ట్ హౌస్ నిర్మాణం చేస్తున్నాడని తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు రక్షించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా చేసిన తప్పులు సరి చేసుకుని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని, జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు షీల్డ్ టెండర్ల ఆహ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నియంత్రణలో, విశాఖపట్నం రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఫర్నిచర్‌తో సహా అన్ని సౌకర్యాలతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణానికి, నమోదిత సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్టు ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ పని అంచనా వ్యయం రూ.50 లక్షలని, టెండర్ డాక్యుమెంట్లను పొందేందుకు, టెండర్‌ను దాఖలు చేయడానికి ఈనెల 15 చివరి తేదీ అని, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు టెండర్లు తెరవడం జరుగుతుందని తెలిపారు. టెండర్ ఫర్ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎట్ డిఐజి ఆఫీసు, విశాఖపట్నం అని అని సూపర్ స్క్రైబ్ చేసిన సీల్డ్ కవర్‌ను ది సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, అనకాపల్లి జిల్లా చిరునామాకు పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా సమర్పించాలని కోరారు. అదనపు వివరాల కోసం అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా 98492 40203 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## నేటి నుండి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు అనకాపల్లి జిల్లాలో ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యాన నిర్వహించడం జరుగుతుందని ఆ సంస్థ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ గొప్పు ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కళాశాలలలో వర్క్ షాపులు నిర్వహిస్తారన్నారు. విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. పోటీలలో విజేతలకు 20న బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

## 15న వైసిపి ర్యాలీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మునగపాక : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీన అనకాపల్లి జిల్లా కేంద్రంలో జరగనున్న ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బొడ్డేడ ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణలో భాగంగా ఎలమంచిలి నియోజకవర్గంలో 60 వేలు, అనకాపల్లి జిల్లా మొత్తం 4 లక్షల సంతకాలను సేకరించినట్లు చెప్పారు. వాటిని తాడేపల్లికి తరలిస్తున్న సందర్భంగా 15న అనకాపల్లి మార్కెట్ యార్డ్ నుండి ర్యాలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైకాపా అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, జడ్పిటిసి స్వామి సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఈనెల 17న జరగనున్న మెగా జాబ్ మేళా యువత సద్వినియోగం చేసుకోవాలని కూటమి నాయకులు సూచించారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అనకాపల్లి ఆదినారాయణ మహిళా కళాశాలలో ఈ నెల 17న జరిగే మెగా మేళాలో 57 కంపెనీలకు చెందిన 1300 ఉద్యోగాల భర్తీ కోసం జరిగే జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు. ఆ రోజు ఉదయం 9 నుండి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావు, ఉగ్గిన రమణమూర్తి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కర్రి సత్యనారాయణ, సిహెచ్‌ఎన్ అగ్రహారం పిఎసిఎస్ అధ్యక్షులు బంటు రవి, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహన్ రావు, వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సకల గోవింద్, విల్లూరి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ సినీ నటులు విక్టరీ వెంకటేష్ పుట్టిన రోజు వేడుకలు అనకాపల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి గవరపాలెం పార్క్ సెంటర్ వద్ద వెంకటేష్ అభిమానులు ఆధ్వర్యంలో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. పుట్టిన రోజు కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకుడు చందు, పీవీ జగన్ మోహన్‌రావు, పెనుమత్స సతీష్ వర్మ, మారిశెట్టి భాస్కర్, లాయర్ శ్రీను, కొంగా నాగేశ్వరరావు, రాయి వెంకట రమణ, పలివెల రాంబాబు, కిరణ్, దాడి రవికుమార్, బుద్ద భువనేశ్వర్‌రావు, పెంటకోట సత్యనారాయణ, విల్లూరి సత్య నారాయణ, బుద్ద జోగినాయుడు, శివనాయుడు, దుప్పిటూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న టిడిపి నేత గండి బాబ్జి

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ గ్రామానికి చెందిన లగిశెట్టి శేషు వరహా లక్ష్మణరావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.2 లక్షల చెక్కును శనివారం అందజేశారు. లక్ష్మణరావు తీవ్ర అనారోగ్యంతో బాధపడడంతో సీఎం రిలీఫ్ ఫండ్ వైద్య చికిత్స నిమిత్తం గతంలో రూ.6 లక్షలు మంజూరు కాగా చికిత్స కొనసాగుతుండడంతో వైద్య ఖర్చులకు సరిపోలేదు. దీంతో ఈ విషయాన్ని పెందుర్తి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్వయంగా ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యలను వివరించారు. దీనికి స్పందించిన ముఖ్యమంత్రి మరో రూ.2లక్షలు మంజూరు చేశారు. గండి బాబ్జికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## 'రామాలయ నిర్మాణం పూర్తి చేస్తాం'

బుచ్చయ్యపేట మండలం వడ్డాది ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కెఎస్‌ఎన్‌ఎస్ రాజు హామీ ఇచ్చారు. శనివారం రామాలయాన్ని ఆయన సందర్శించారు. సోమ మంగళవారాలలో అమరావతిలో సంబంధిత అధికారులను కలిసి టీటీడీ, దేవాదాయ శాఖల నుండి తక్షణమే రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు.

## 6వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-మునగపాక : మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవిన్యూ డివిజన్లోనే కొనసాగించాలని కోరుతూ స్థానిక మెయిన్ రోడ్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. మునగపాక, చూచుకొండ, మెలిపాక గ్రామాల నాయకులు దీక్షలో కూర్చున్నారు. వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాదులు దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వసతులు ఉన్న ఎలమంచిలిని రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చియ్య నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షల్లో పాల్గొన్న ధర్మశ్రీ, ప్రజలు

## కోతుల బారి నుండి

# విద్యార్థులకు రక్షణ కల్పించాలి

### సిపిఎం ఆధ్వర్యాన తల్లుల నిరసన

చేతులు జోడించి నిరసన చేపడుతున్న గిరిజన మహిళలు

**ప్రజాశక్తి-రావికమతం:**రావికమతం హాస్టల్‌లో చదువుతున్న గిరిజన విద్యార్థులను కోతుల దాడి నుండి రక్షణ కల్పించాలంటూ శనివారం చేతుల జోడించి నమస్కరిస్తూ సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కే గోవిందరావు, తల్లిదండ్రులు మాట్లాడుతూ, ప్రతిరోజు హాస్టల్ వద్ద గుంపులు, గుంపులుగా సంచరిస్తున్న కోతులు విద్యార్థులపై దాడి చేస్తున్నాయన్నారు. కోతుల భయంతో హాస్టల్‌లో ఉన్న 96 మంది గిరిజన విద్యార్థులను సొంత గ్రామాలకు తల్లిదండ్రులు తీసుకువెళ్లిపోయారని తెలిపారు. వీరికి కోతల దాడి నుండి రక్షణ కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తే సోమవారం నుంచి హాస్టల్‌కు పిల్లలను పంపించడం జరుగుతుందని తెలిపారు. కోతుల దాడికి గురైన విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం కొరకు అయ్యే ఖర్చు భరించాలన్నారు. గత నెల రోజులుగా కోతులు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యం కారణంగానే నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు.హాస్టల్లో ఉన్న పెద్ద పెద్ద చెట్లు తొలగించాలని, హాస్టల్‌కు కిటికీలు తక్షణమే మరమ్మతు చేయాలని తెలిపారు. హాస్టల్ చుట్టూ ఇనుప కంచెలతో మెస్సును అమర్చాలని, అప్పుడు మాత్రమే విద్యార్థులకు రక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులు మాత్రం ఈ విషయాన్ని చిన్న విషయంగా భావిస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కోతులన్నింటిని ఏరివేసి జూ లో వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా గోవింద్



గోవింద్

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలో అమలాపురం పంచాయతీ మూలపర్ర గ్రామానికి చెందిన సూరకాసుల గోవిందును వైసీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను జారీ చేసింది. వేంపాడు పిఎసిఎస్ అధ్యక్షులు, పాయకరావుపేట మార్కెట్ యార్డ్ డైరెక్టర్, వైసిపి జెసిఎస్ జిల్లా కోఆర్డినేటర్ వంటి పదవులు గోవిందు చేపట్టారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పలు కీలక పదవుల్లో కూడా ఆయన పనిచేశారు.వైసిపి లో గోవింద్ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గోవింద్ సేవలను పార్టీ గుర్తించి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమించింది. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ, తనను రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు అండగా నిలిచి, రైతు సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పని చేస్తానని, పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ తనపై ఉన్న నమ్మకంతో తనను రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమించారని, బాధ్యతతో పని చేస్తానని గోవింద్ అన్నారు. గోవిందుకు పలువురు అభినందనలు తెలియజేశారు.

## విదేశీ విద్యార్థులు 'గీతం రాయబారులు'

### -ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవంలో ప్రో విసి గౌతమ్‌రావు

**ప్రజాశక్తి-మధురవాడ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో స్టడీ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రవేశాలు పొందిన వివిధ దేశాల విద్యార్థులను అంతర్జాతీయంగా గీతం పేరు ప్రఖ్యాతులను విస్తరింప చేసే గీతం రాయబారులుగా పరిగణిస్తామని విశ్వవిద్యాలయం గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పేర్కొన్నారు. గీతంలో వివిధ కోర్సులతో పాటు నర్సింగ్ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశాలకు తిరిగి వెళుతున్న విద్యార్థులకు శనివారం ప్రత్యేక పట్టభద్రుల దినోత్సవం నిర్వహించి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రణాళికాయతంగా చర్యలు తీసుకుంటోందని, చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల ద్వారా తీర్చిదిద్దుతోందని చెప్పారు ఏటా విదేశీ విద్యార్థుల సంఖ్య పెరుగుతూ ఉండటంతో తదనుగుణంగా సౌకర్యాలపై దృష్టి సారించామన్నారు. దేశానికి, సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు తమ మేధస్సును ఉపయోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేశన్ బాలు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. నూతన విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## సంప్రదాయ దుస్తుల్లో ఆకట్టుకున్న విద్యార్థులు

విద్యార్థులతో హెచ్ఎం

**ప్రజాశక్తి - రావికమతం :**మండలంలో చినపాచిల జడ్పీ హైస్కూల్లో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహ భరితంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ శ్రీ మాట్లాడుతూ. పలు రాష్ట్రాల్లో పలు రకాల సాంప్రదాయ దుస్తులు ధరిస్తుంటారని, అందులో భాగంగా చిన్నపాచిల హైస్కూల్ విద్యార్థులు అదే రీతిలో హాజరు కావడం అందరిని ఆశ్చర్యపరిచిందన్నారు. ఆదివాసి గిరిజనులు, లంబాడి, తదితర వస్త్రధారణ తరచూ మనం చూస్తున్నామన్నారు. ఏక్ భారత్, శ్రేష్ట భారత్‌లో భాగంగా దేశ సమైక్యతపై విద్యార్థులకు అవగాహనకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థులకు నేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రోహిత్‌ను అభినందిస్తున్న చైర్మన్, హెచ్ఎం

## జాతీయ స్థాయి హాకీ పోటీలకు రోహిత్ ఎంపిక

**ప్రజాశక్తి- నక్కపల్లి:**నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి దొడ్డా రోహిత్ జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. విజయ తెలిపారు. డిసెంబర్ 9వ నుండి 11 వ తేదీ వరకు వై.ఎస్.ఆర్ కడప జిల్లా, పులివెందుల లో జరిగిన అండర్ - 17 హాకీ పోటీల్లో దొడ్డా రోహిత్ ప్రతిభ కనబరచడంతో వచ్చే ఏడాది జనవరి నెలలో జార్కండ్ రాష్ట్రం రాంచిలో జరగనున్న జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీల్లో రోహిత్ పాల్గొంటాడని హెచ్ఎం వెల్లడించారు. జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీలకు ఎంపికైన రోహిత్‌ను హెచ్ఎం, పాఠశాల చైర్మన్ అడ్డూరి శ్రీనివాసరావు, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ లోవ రాజు, ఉపాధ్యాయులు టి. వి. రమణ, డి. శ్రీనివాస్, పి.వరలక్ష్మి, పి.శ్రీనివాస్, పి.డి.ధనలక్ష్మిలు అభినందనలు తెలియజేశారు. జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి-పాయకరావుపేట :** మండలంలోని మంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థ్యులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. అంగన్వాడి సూపర్ వైసర్ షేక్ రంజాన్ బీబీ మాట్లాడారు. బాల్య వివాహాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలు చేయడంతో శారీరకంగా పలు సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తుప్పలు తొలగిస్తున్న కూటమి నాయకులు

## శ్మశాన రహదారిలో తుప్పల తొలగింపు

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని ఏటిగైరంపేట పంచాయతీ శివారు ఎర్రన్నపాలెం గ్రామంలోని శ్మశానానికి వెళ్లే రోడ్డులో తుప్పలు, డొంకలు పెరిగి పోవడంతో గ్రామస్తులు అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో శనివారం కూటమి నాయకులు ఈ శ్మశానవాటికకు వెళ్లే రోడ్డును శుభ్రం చేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిడిజాన రామకృష్ణ మాట్లాడుతూ, శ్మశానానికి వచ్చే వారి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ బిడిజాన నూకరాజు, సీనియర్ నాయకులు నల్లబెల్లి రాజబాబు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు అల్లు స్వామి, పోలుపర్తి రాము, నల్లబెల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్షలు

**ప్రజాశక్తి -నక్కపల్లి:**ఆరవ తరగతిలో ప్రవేశాల కోసం ప్రతీ ఏటా నిర్వహించే నవోదయ ఎంట్రన్స్ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగిందని నక్కపల్లి గురుకులం ప్రిన్సిపల్ ఉషారాణి తెలిపారు. స్థానిక గురుకులంలో నవోదయ ఎంట్రన్స్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 240 మంది విద్యార్థులకు గాను 185 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. పరీక్షా కేంద్రాన్ని ఆమె పర్యవేక్షించారు.

**వడ్డాది**

: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష వడ్డాది జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రంలో 155 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ ప్రసన్న కళ తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న పలువురు విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు.

నక్కపల్లిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వడ్డాదిలో పరీక్షా కేంద్రం వద్ద ఉన్న విద్యార్థులు

రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

## వైభవంగా కనకమహాలక్ష్మి రథయాత్ర

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:కనకమహాలక్ష్మి అమ్మవారి రథయాత్రను శనివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సాంప్రదాయ బద్ధంగా ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఆలయ ఈవో, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అంబికా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథం వద్ద నిర్వహించిన ప్రత్యేక క్రతువు అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి రథయాత్ర మహోత్సవ వేడుకను ప్రారంభించారు. అంబికా బాగ్ రామాలయం నుంచి జగదాంబ జంక్షన్ వరకు ఎమ్మెల్యే శ్రీనివాస్ రదయాత్రలో పాల్గొన్నారు. కోలాటం, తప్పెడు గుళ్ళు, పులి వేషాలు, భజనలు, డప్పుల సవ్వడి తో అమ్మవారి రథయాత్ర వేడుక ఘనంగా, వైభవంగా నిర్వహించారు. అనేకమంది భక్తులు అమ్మవారి రథంతో కోలాహలంగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఎఈఓ ఆనందకుమార్, ఈఈ రమణ, ప్రధాన అర్చకులు శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ పెద్దలు,భక్తులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులతో అధ్యాపకులు

## నూతన ఉపాధ్యాయులకు ఘన సత్కారం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:.ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు విభాగం అరుదైన ఘనతను సొంతం చేసుకుంది.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ 2025లో ఏకంగా 52 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు దక్కించుకున్నారు. శనివారం ఏయూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందర్భంగా తాజాగా కొలువులు పొందిన 52 మందిని తెలుగు విభాగం శాఖ అధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ నరసింహారావు మాట్లాడుతూ 100 ఏళ్ల పండుగ జరుపుకుంటున్న ఆంధ్ర యూనివర్సిటీలో చదువుకున్న వారంతా ఎంతో ధన్యజీవులు అన్నారు. యూనివర్సిటీ ప్రారంభించేటప్పుడు తెలుగు ఆర్ట్స్ గ్రూపులతోనే ప్రారంభించారన్నారు. ఆ తర్వాత దశల వారీగా ఏయుని ఎంతోమంది అభివృద్ధి చేశారన్నారు. నేడు ప్రపంచంలోనే ఆంధ్ర విశ్వ కళాపరిషత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిలిచిందన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షులు, నిర్వాహకులు ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ, ఎంతో మందిని ఈ సమాజానికి అందించిన ఘనత ఏయూకే దక్కుతుందన్నారు.. తన హయాంలో ఏకకాలంలో ఒకే డీఎస్సీలో 52 మంది టీచర్ ఉద్యోగాలు సాధించడం తనకు చిరస్థాయిగా మధురానుభూతిని మిగిలిస్తుందన్నారు.. బహు గ్రంథకర్త లోక్ నాయక్ ఫౌండేషన్ అవార్డు గ్రహీత గొరవాచార్యులు వెలమల సిమ్మన్న, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ సత్యనారాయణులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పద్మావతి యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ ఆచార్య మధుజ్యోతి, ఎయు సీనియర్ ఆచార్యులు గజ్జ యోహాను బాబు, అంబేద్కర్ యూనివర్సిటీ అధ్యాపకురాలు అన్నం రెడ్డి ఈశ్వరమ్మ, మరో అధ్యాపకురాలు ప్రవీణ పాల్గొని సందడి చేశారు. ఏయూ పరిశోధక విద్యార్థి జాతీయ జర్నలిస్టులు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

# లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభం

## - సందడి చేసిన సినీ నటి అనసూయ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: నగరంలోని జిల్లా కోర్టు రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్‌ను శనివారం సినీ నటి, టీవీ యాంకర్ అనసూయ ప్రారంభించారు. ముందుగా షాపింగ్ మాల్ ఎదుట గుమిగూడిన అభిమానులకు ప్రజలకు అభివాదం తెలిపి సందడి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ పి.గణబాబు, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, లక్కీ షాపింగ్ మాల్ అధినేతలు రత్తయ్య, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్కీ షాపింగ్ మాల్ అధినేత రత్తయ్య మాట్లాడుతూ, విశాఖ నగరంలో 15 లక్కీ షాపింగ్ మాల్స్ ఉన్నాయన్నారు. తమ వ్యాపారం ముందుకు సాగడానికి ప్రజల ఆదరణ ముఖ్యం కాగా,స్థానిక ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం కూడా ఎంతో ఉందన్నారు. దక్షిణ భారతదేశంలో ఫ్యామిలీ కలెక్షన్స్ లో తిరుగులేని ఆదరణ లక్కీ షాపింగ్ మాల్స్ కు ఉందని చెప్పారు. నమ్మకమైన నాణ్యతతో పాటు ప్రజల బడ్జెట్ ధరల్లో వస్త్రాలను అందిస్తున్నామని చెప్పారు. కొత్త లక్కీ షాపింగ్ మాల్ విశాఖ నగర ప్రజల ఫ్యాషన్, జీవన శైలిని మార్చబోతుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఎత్నిక్ వేర్ నుంచి ఆధునిక రెస్టారెంట్ స్టైల్స్ వరకు అందుబాటులో ఉండే ధరలలో, అదిరిపోయే ఆఫర్లతో స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. అద్భుతమైన షాపింగ్ అనుభూతిని అందించే షోరూం, అపరిమితమైన కలెక్షన్స్, మోడల్స్ అందుబాటు ధరలతో లేడీస్ వేర్, మెన్స్ వేర్, ఫ్యాన్సీ, హై ఫ్యాన్సీ, డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్ టీ షర్ట్స్ తదితర వస్త్రాలు లభిస్తాయని తెలిపారు.

ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంటా, మావూరి తదితరులు

అభివాదం చేస్తున్న సినీనటి అనసూయ

## నేడు స్పాట్ కార్టూన్ పోటీలు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:ఈనెల 27 నుంచి వచ్చే నెల 2 వరకు బీచ్ రోడ్డు ఎగ్జిబిషన్ మైదానంలో జరపనున్న శ్రామిక ఉత్సవ్ ప్రదర్శన కోసం స్పాట్ కార్టూన్ పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రముఖ కార్టూనిస్టు హరి వెంకటరమణ తెలిపారు. ఈ పోటీలు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరుగుతాయన్నారు. శ్రామికుల డిజిటల్ యుగం సవాళ్లు, మహిళా శ్రామికుల సాధికారత, యువత ఉద్యోగాలు, కలలు, వాస్తవాలు, కార్మికులు, గిగ్ ఎకానమీ, శ్రామిక యూనియన్లు కార్పొరేట్ కంపెనీలు, వాతావరణ మార్పులు, లేబర్ మార్కెట్లపై ప్రభావం, ఆర్థికాభివృద్ధిలో శ్రామికులు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, మత సామరస్యం, ఐకమత్యం అంశాలపై ఈ పోటీలు ఉంటాయన్నారు. ఉత్తమ చిత్రాలు శ్రామిక ఉత్సవ్‌లో ప్రదర్శిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్:9866084124 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

## 15న ర్యాలీ

ప్రజాశక్తి-జి.మాడుగుల: కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈనెల 15న పాడేరు జిల్లా కేంద్రంలో అల్లూరి జిల్లా వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ భారీ ర్యాలీకి భారీ సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలన్నారు.

## గీతంలో 'స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్' ముగింపు

ప్రజాశక్తి-మధురవాడ : యువతలో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసిటిఇ) జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్' ఫైనల్ పోటీలు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ముగిశాయి. ఈ స్మార్ట్ఇండియా హ్యాకథాన్ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 25 విద్యార్థి బృందాలు పాల్గొన్నారు. ఈ పోటీలకు ఏఐసిటిఇ అధికారులు, సిద్ధార్థ శర్మ, రంగనాథ్‌ఓజా పాటు ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు సుకేందు దత్తా, రిషిమహాజన్, రంజిత్ కుమార్ మిశ్ర, అరవింద కుమార్, ఇండోటిబెటెన్ బోర్డర్ పోలీస్ డిఐజి పవన్ మాలిక్, డిప్యూటీ కమాండెంట్ గౌతమ్‌కుమార్, ట్రైనీటెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ వి.సత్యేంద్ర, కృత్రిమ మేధ నిపుణుడు సూరజ్ వంక, గీతం ప్రొఫెసర్లు ఆర్.రాజేశ్వరరెడ్డి, క్రాంతికిరణ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విశాఖ పర్యవేక్షకుడిగా గీతం విడిసి కోచ్ బి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు విజేతలకు బహుమతులు అందజేశారు.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## డ్రగ్స్ వ్యతిరేక ఎక్స్‌పోలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-పరవాడ : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. మండలంలోని వెన్నెలపాలెం బండారు అప్పలనాయుడు ఫంక్షన్ హాల్‌లో 'డ్రగ్ రహిత భవిష్యత్తు' అన్న అంశంపై పోలీసు శాఖ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఎక్స్‌పోను శనివారం ఆయన ప్రారంభించారు. పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, రాంబిల్లి, మునగపాక, సబ్బవరం మండలాల్లోని 64 పాఠశాలలు, కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు, 100 మంది ఉపాధ్యాయులు దీనికి హాజరయ్యారు. విద్యార్థులు 150కి పైగా అవగాహన మోడల్స్ ప్రదర్శించి, డ్రగ్స్ దుష్ప్రభావాలను వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ తుహిన్ సిన్హా ప్రతి స్టాల్‌ను పరిశీలించి విద్యార్థుల సృజనాత్మకత ప్రశంసించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'జీవితానికి అవును చెపుదాం - డ్రగ్స్‌కి కాదు చెపుదాం' అని యువతను హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయన్నారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ఏ చిన్న సమాచారమైనా వెంటనే 112 లేదా 1972 నెంబర్లకు తెలియజేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన రెండు నాటికలు డ్రగ్స్ వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక, కుటుంబ, సామాజిక నష్టాలను స్పష్టంగా చూపించాయి.

విజేతలు : రాంబిల్లి లోటస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ బహుమతి రూ.10వేలు, పరవాడ సుమేధా విద్యానికేతన్2వ బహుమతి రూ.9 వేలు, అచ్యుతాపురం క్రెట్స్ జూనియర్ కళాశాల, స్కూల్ 3వ బహుమతి రూ.8వేలు, పరవాడ ఏబీఎస్ స్కూల్ 4వ బహుమతి రూ.5వేలు సాధించాయి. అలాగే కన్సోలేషన్ బహుమతులు (ప్రతి స్కూల్ రూ.3,000 చొప్పున) యలమంచిలి సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జెపి గర్ల్స్ జూనియర్ కళాశాల, లంకెలపాలెం జెపి హైస్కూల్, మునగపాక ప్రతిమ విద్యానికేతన్, సబ్బవరం ప్రతిభ స్కూల్, అచ్యుతాపురం జెపి హైస్కూల్ పొందాయి. కార్యక్రమంలో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, అచ్యుతాపురం సీఐ ఆర్‌వివిఎస్-ఎస్.శేఖర్‌రావు, రాంబిల్లి సీఐ నర్సింగరావు, సబ్బవరం సీఐ జి.రామచంద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

# సిఐటియు అఖిల భారత మహాసభపై ప్రచారం

ప్రజాశక్తి-చోడవరం : విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు శనివారం చోడవరంలో ప్రచారం నిర్వహించారు. చోడవరం కొత్తూరు జంక్షన్‌లో దుకాణాలకు వెళ్లి మహాసభల జయప్రదానికి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎపిలోని విశాఖలో సిఐటియు అఖిల భారత మహాసభలు తొలిసారిగా జరుగుతున్నాయని తెలిపారు. వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు, స్కీమ్ వర్కర్ల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిఐటియు మహాసభల జయప్రదానికి సహకారం అందించాలని కోరారు. అలాగే చివరి రోజు విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగు భారీ బహిరంగ సభకు హాజరైన జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్ దేముడు నాయుడు, ఎస్‌వి నాయుడు, దేవుళ్ళు, నాగిరెడ్డి సత్యనారాయణ, చంద్రరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు